
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 93 వ భాగం

### భాగవత కథ, మోక్ష సాధనం

క్రితం నెల వ్యాసంలో యోగులు పరబ్రహ్మాన్ని జేరుకునేదారీ, ఎవరు ఎలా వెళ్తే వెనక్కి తిరిగి వస్తారో, ఎవరు రారో చెప్పాక పరీక్షిత్తుకి ఇంకా సులభమైన మార్గం చెప్తున్నాడు శుకయోగి. ఎందుకంటే, మనలాంటి వాళ్ళకోసమే. అందరం యోగులం అయ్యి బ్రహ్మరంధ్రం గుండా ముక్తి పొందడం అసంభవం కనక.

వ. వినుము; నీ వడిగిన సద్యోముక్తియుఁ గ్రమముక్తియు ననియెడు నీ రెండు మార్గంబులు వేదగీతలందు వివరింపబడియె; వీనిం దొల్లి భగవంతుం డైన వాసుదేవుండు బ్రహ్మచేత నారాధితుండై చెప్పె; సంసార ప్రవిష్టుండైన వానికిఁ దపోయోగాదు లయిన మోక్షమార్గంబులు పెక్కులు గల; వందు భక్తిమార్గంబు కంటె సులభంబు లేదు. [2-34]

మొదట్లో బ్రహ్మకి సృష్టి ఎలా చేయాలో తెలియనపుడు తపస్సు చేసాడు కదా, అప్పుడు భగవంతుడు కనిపించి చెప్పాడు ఈ విషయం. ఈ సంసారంలో చిక్కుకున్నవాళ్ళకి అనేక మార్గాలున్నాయి మోక్ష సాధనకి. వీటినే మనం జ్ఞాన, కర్మ, భక్తి, రాజ యోగాలు అంటున్నాం ఇప్పుడు. వీటిలో అన్నింటికన్నా సులభం భక్తి మార్గం. మిగతా మార్గాలలో కొన్ని కష్టాలున్నాయి, అవి అందరికీ సరిపడకపోవచ్చు.

మ. విను, మంభోజభవుండు మున్ను మదిలో వేదంబు ముమ్మాఱు ద
ర్శన యజ్ఞత్వముతోడ నెంతయుఁ బరామర్శించి, మోక్షంబు ద
క్కిన మార్గంబుల వెంట లే దనుచు భక్తిం జింత సేసెన్ జనా
ర్దను నాత్మాకృతి నిర్వికారుఁ డగుచుం దన్మార్గ నిర్ణేతయై. [2-35]

బ్రహ్మ (అంభోజభవుండు, పద్మంలో పుట్టినవాడు) మనసులో వేదాలని దర్శించి చూసాక మోక్షం కోసం భక్తి మార్గం కంటే మరో మంచిది లేదని తెలుసుకుని అదే మార్గంలో భగవంతుణ్ణి ధ్యానించాడు.

క. కామింపకయును సర్వముఁ
గామించియునైన ముక్తిఁ గామించి తగన్
లో మించి పరమపురుషుని
నేమించి భజించుఁ దత్త్వనిపుణుం డధిపా! [2-39]

మనుషుల్లో ఏదో ఒకటి కోరుకునేవారుంటారు, కానీ ఏదీ కోరుకోని వారు, ముక్తి కోసం మాత్రమే పరమేశ్వరుణ్ణి కొలుస్తూ ఉంటారు. ఈ విషయం ఇంతకు ముందు వ్యాసాల్లో చూసాం కదా. బుద్ధుడు, రామకృష్ణులూ చెప్పేది కూడా ఇదే. ఏమిటి మన దుఃఖానికి కారణం అంటే కోరిక. కోరిక తీరకపోతే దుఃఖం ఉండనే ఉంది. తీరితే మరో కోరిక ఉదయించడం, అది కూడా తీరిన తర్వాత మరొకటి బయల్దేరడం జరుగుతుంది. అన్ని కోరికలూ తీరడం అసంభవం కాబట్టి మిగిలేది దుఃఖం. అందుకే చెప్తారు వివేకానందులు, "దేనినీ కోరవద్దు. ఆఖరికి భగవంతుణ్ణి కానీ, మోక్షాన్ని కానీ కోరవద్దు. భగవంతుణ్ణి నిరంతరం గుర్తుపెట్టుకోండి. మిగతావన్నీ ఆయనే చూస్తాడు."

మ. అమరేంద్రాదులఁ గొల్చుభంగి జనుఁడా యబ్జాక్షు సేవింపఁగా
విమలజ్ఞాన విరక్తి ముక్తు లొదవున్, వేయేల భూనాథ! త
త్కమలాధీశ కథాసుధారస నదీకల్లోలమాలా పరి
భ్రమ మెవ్వారికినైనఁ గర్ణయుగళీపర్వంబు గాకుండునే?" [2-40]

అయినా, ఇంద్రుణ్ణీ, మిగతా దేవతలనీ కొలిచి ఏదో ఒకటి పొందుతున్నాం, అలాగే భగవంతుణ్ణి, కమలాధీశుణ్ణి కొలిస్తే విరక్తి, జ్ఞానం, ముక్తీ లభిస్తాయి కదా? అందులోనూ హరి కథలు చెవులకి అమృతం (గర్ణయుగళీపర్వంబు) కదా?

క. తూలెడి కూఁకటితోడను
బాలురతో నాడుచుండి బాల్యమున మహీ

పాలుఁడు హరిచరణార్చన
హేలాలసుఁ డగుచు నుండె నెంతయు నియతిన్. [2-45]

ఈ భాగవతం వినే పరీక్షిత్తు ఎటువంటివాడంటే, తూలిపడే జులపాల జుట్టుతో ఉన్నప్పటినుండే కృష్ణుడి గురించి విన్నవాడు కనక ఎప్పుడూ భగవంతుడి పాదపద్మాలనే అర్చించేవాడు. అటువంటివాడికే భాగవత కథ చెప్పడం. దీనికి ఇంకా వివరణ ఇస్తున్నాడు. పరీక్షిత్తు పుట్టినప్పుడే ప్రాణం లేకుండా పుట్టాడు కదా, అశ్వత్థామ వేసిన బ్రహ్మశిరోనామకాస్త్రం వల్ల? అలా పుట్టినవాడికి కృష్ణుడు [పాండవులకిచ్చిన మాట ప్రకారం] ప్రాణం పోసాడు. అందువల్లే పరీక్షిత్తు పరమ భాగవతుడు అని భాగవతంలో అంటాడు, పోతన.

అయితే భగవంతుడి గురించి తెలియని మన లాంటి వాళ్ల బతుకులు ఎలా ఉంటాయనేది చెప్తున్నాడిప్పుడు. ఇదే విషయం వివేకానందులు కూడా చూచాయగా చెప్తారు. "భగవంతుదున్నాడా లేదా అనే విషయం వదిలిపెట్టండి. ఆత్మజ్ఞానం అనే ఒక మహోత్తరమైన తెలుసుకునేది ఉందని గుర్తించి దాన్ని వెదకడానికి ప్రయత్నం చేయండి. అది అందితే సంతోషం. అందకపోయినా ఏమీ బాధపడే అవసరం లేదు ఎందుకంటే, పశువుల్లా తిని తిరుగుతూ బతకడం కంటే మహోత్తరమైన సత్యాన్ని వెతుకుతూ దేహం చాలించడం ఎన్నో రెట్లు మేలు."

సీ. అలరు జొంపములతో నభ్రంకషంబులై
బ్రదుకవే వనములఁ బాదపములు?
ఖాదన మేహనాకాంక్షలఁ బశువులు
జీవింపవే గ్రామసీమలందు?
నియతిమై నుచ్ఛ్వాస నిశ్వాస పవనముల్
ప్రాప్తింపవే చర్మభస్త్రికలును?
గ్రామసూకరశునకశ్రేణు లింటింటఁ
దిరుగవే దుర్యోగదీనవృత్తి? [2-49]

తే. నుష్ట్రఖరములు మోయవే యురుభరములఁ?
బుండరీకాక్షు నెఱుఁగని పురుషపశువు
లడవులందు, నివాసములందుఁ బ్రాణ
విషయభరయుక్తితో నుంట విఫల మధిప! [2-49.1]

అడవుల్లో ఆకాశాన్ని (అభ్రంకషంబులై) అంటుతూ చెట్లు (పాదపములు) పెరుగుతున్నాయి. పశువులు తిండీ, మైధునం అనే కాంక్షలతో గ్రామాల్లో బతుకుతున్నాయి. కొలిమి దగ్గిరవాడే తిత్తులు (చర్మ భస్త్రికలు) కూడా గాలి పీలుస్తున్నాయి బయటకీ వెలుపలకీ. ఊళ్లలో ఉండే కుక్కలూ పందులూ ఇంటింటికీ తిరిగి దీనంగా తిరుగుతున్నాయి తిండి కోసం. ఒంటెలూ గాడిదలూ కూడా బరువులు మోస్తున్నాయి జీవితం తిరగడం కోసం. భగవంతుడి గురించి తెలుసుకోకపోతే మనిషి జీవితం కూడా ఈ పైన చెప్పిన వాటి బ్రతుకుల్లాగానే వ్యర్థం.

ఆ. సుతుల హితుల విడిచి, చుట్టాల విడిచి, యి
ల్లాలి విడిచి, బహు బలాళి విడిచి
రాజు హృదయ మిడియె రాజీవనయనుపై
ధనము విడిచి, జడ్డుఁదనము విడిచి. [2-53]

శుకమహర్షి ఇలా చెప్పేసరికి పరీక్షిత్తు చుట్టాలనీ, సుతులనీ, హితులనీ అన్నీ విడిచిపెట్టి భాగవతం వినడానికి ఉద్యుక్తుదయ్యేడు. చిన్నప్పటినుండే హరిభక్తి ఉన్నా సరే ఇప్పటివరకూ ఎందుకు ఇలా చేయలేదో ఒకసారి ఆలోచిద్దాం. పరీక్షిత్తు రాజు కదా? ఆ కార్యకలాపాల్లో ఉన్నాడు. అదీగాక తగిలిన శాపం మనసులో తొలుస్తోంది కాబోలు. 'సరిగ్గా వారంలో పోతావు నువ్వు' అని ఎవరైనా చెప్పారనుకోండి ఎలా ఉంటుంది? అటువంటి మరణ భయం, వ్యాకులత ఉన్న వాడికి శుక మహర్షి అంతటివాడు తప్ప ధైర్యం కలిగిచలేడు కదా? అందుకే ముందు చెట్లకంటే, పశువులకంటే మనిషి అధికం కనక మనసు భగవంతుడి మీద పెట్టాలి అని చెప్పాడు శుకుడు. అంత చెప్పాక ఇంక ఇప్పటివరకూ మనకూడా ఉన్న ఏదీ మనతో రాదని తెలిసి వచ్చింది. ఇదే సన్యాసానికి (అన్నీ వదులుకోవడానికి) కారణం.

వ. ఇట్లు మృత్యుభయంబు నిరసించి, ధర్మార్థకామంబులు సన్యసించి, పురుషోత్తము నందుఁ జిత్తంబు విన్యసించి, హరిలీలా లక్షణంబు లుపన్యసింపు మను తలంపున నరేంద్రుం డిట్లనియె. [2-54]

సీ. ఈశుండు హరి విష్ణుఁడీ విశ్వమే రీతిఁ
బుట్టించుఁ రక్షించుఁ బొలియఁ జూచు?
బహు శక్తి యుతుఁడగు భగవంతుఁ డవ్యయుఁ
డాది నే శక్తుల నాశ్రయించి

బ్రహ్మ శక్రాది రూపముల వినోదించెఁ?
గ్రమముననో యేక కాలముననొ
ప్రకృతి గుణంబులఁబట్టి గ్రహించుట?
నేకత్వముననుండు నీశ్వరుండు [2-56]

ఆ. భిన్నమూర్తి యగుచుఁ బెక్కు విధంబుల
నేల యుండు? నతని కేమి వచ్చె
నుండకున్నఁ? దాపసోత్తమ! తెలుపవే;
వేడ్క నాకు సర్వవేది వీవు." [2-56.1]

భగవంతుడి మీదకి దృష్టి మరల్చగానే ఏమైంది? అప్పటివరకూ సముద్రంలో కొట్టుకుపోతున్నవాడికి ఏదో పట్టుకోవడానికి ఆసరా దొరికింది. ఆపద నుంచి ఎలాగా తప్పించుకోలేము అని తెలిసినప్పుడు మరో విధం ఏమిటంటే ఆ ఆపద తర్వాత ఏం చేయొచ్చు అనేది – ఇదే పరీక్షిత్తుకు దొరికిన ఆసరా, శుకమహర్షి ద్వారా. మనసులో అందర్నీ సన్యసించి ఇప్పుడు అడుగుతున్నాడు.

భగవంతుడు ఈ విశ్వాన్ని ఎలా పుట్టించి, పోషించి, లయం చేస్తూ ఉంటాడు? ఆయన అవ్యయుడు అంటున్నారు కదా అనేకమందిని సృష్టించి, అనేక రూపాల్లో ఎలా వినోదిస్తూ ఉంటాడు? ఏకత్వంతో ఉండే ఈశ్వరుడు భిన్నమూర్తులతో ఎందుకు ఉండాలి? అలా ఉంటే ఆయనకి ఏమిటి లాభం? లేకపోతే ఏమిటి నష్టం? దీనికి సమాధానం చూసే ముందు ఒక విషయం గమనిద్దాం.

మనం ఎవర్నో చూడ్డానికి వెళ్ళాం – ఆయన నటుడో, స్వామిగారో లేక డబ్బున్న పెద్దాయనో కావచ్చు. ఏదో మాట్లాడాలి కనక నోరు విప్పి అడుగుతాం. ఆ అడగడంలో కుతూహలం తప్ప ఆయన చెప్పేదానికి లోబడి ఉందామని గానీ ఆయన చెప్పేది మనకి ఏదో ఉపయోగిస్తుందని కానీ అడగం కదా? ఈ అడగడం కూడా చుట్టూ ఉన్న మిగతా జనం మనలని గమనించాలనే. ఇది దాదాపు నూటికి తొంభై మంది చేసే పని. అందుకే రమణ మహర్షులంతటి వారు ఎవరైనా వస్తే ఓ సారి వాళ్లకేసి చూసి ఏమీ మాట్లాడే వారు కాదు. కుతూహలం వేరు, తెలుసుకోవడానికి నిజమైన జిజ్ఞాస వేరు కనక వాళ్ళు సరైన వారికే సమాధానం చెప్తారు. ఇక్కడ పరీక్షిత్తు నిజంగా అన్నీ సన్యసించి మహర్షి ఎదురుగా కూర్చున్నాడు

వినడానికి. అందుకే శుకమహర్షి లోతుగా ఆయనకి కావాల్సింది చెప్పడం మొదలుపెట్టాడు. చెప్పేటప్పుడు వినే ఎవరికీ మనసులో వికారాలు దొర్లకుండా, బాగా చెప్పాలంటే, "నేను చెప్తున్నాను," అనేది ఉండకూడదు. నా చేత భగవంతుడే చెప్పిస్తున్నాడు అనే భావం బలంగా ఉంటే కథ దానికదే సరిగ్గా వస్తుంది. అందువల్ల ముందు శుకమహర్షి చేసే పనేమిటంటే, తన చేత ఈ భాగవత కథ చెప్పించే భగవంతుడికి నమస్కరించడం. అంటే మనకి తెలియని, మనని ఆడించే శక్తి ఏదైతో ఉందో, ఆ శక్తిని — దాన్ని భగవంతుడనండి, హరి అనండి, ధ్యానించడం. అదే కింది పద్యం.

మ. పరుఁడై, యీశ్వరుఁడై, మహామహిముఁడై, ప్రాదుర్భవస్థానసం
హరణక్రీడనుఁడై, త్రిశక్తియుతుడై, యంతర్గతజ్యోతియై,
పరమేష్ఠిప్రము ఖామరాధిపులకుం బ్రాపింపరాకుండు దు
స్తర మార్గంబునఁ దేజరిల్లు హరికిం దత్త్వార్థినై మ్రొక్కెదన్. [2-58]

మొదటగా ప్రార్థన చేస్తూ చెప్తున్నాడు, "పరుడై – అంటే జీవుడి కంటే, ప్రకృతి కంటే వేరైనవాడు, ప్రాదుర్భవ — సృష్టి, స్థాన — స్థితి, గడుస్తున్న కాలం, సంహరణ — లయం చేయడం అనే వాటిలో క్రీడనుడై — ఆటలో ఉండేవాడు, పరమేష్ఠి — మంచి సంకల్ప శక్తుడు, ప్రముఖ, అమరాధిపులకుం — దేవతలకి కూడా అందనివాడై, దుస్తర మార్గమునన్ — అందుకోలేని మార్గం లో ఉండేవాడైన భగవంతుడికి నమస్కారం చేస్తున్నాడు. ఈ ప్రార్థించడం ఎందుకో పద్యం చివరిలో చెప్పాడు గమనించారా? తత్త్వార్థినై — కోరికల కోసం కాదు, ఆయన తత్త్వం, ఆయన్ని తెలుసుకోవడం కోసమే. ఇదే మోక్ష సన్యాసం అంటే. మోక్షం కావాలనుకోవడం కూడా ఓ కోరికే కనక అదీ వద్దు. భగవంతుడొకడే చాలు.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS